

గొలుసు దొంగలు మళ్లీ విజృంభించారు

- విజయపురం, నగరి, సోమల ప్రాంతాల్లో వరుస దొంగతనాలు
- గత అక్టోబరు, నవంబరులో ఏడు ఘటనలు
- రక్షించుకోబోయి ఓ మహిళ మృతి
- బయట తిరగాలంటే భయపడుతున్న మహిళలు



చిత్తూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గతేడాది అక్టోబరు, నవంబరు నెలల్లో మహిళల మెడలో బంగారు గొలుసులు లాక్కెళ్లే ముఠా జిల్లాలో వరుసగా ఏడు దొంగతనాలు చేసి చెలరేగిపోయింది. పూతలపట్టులో అయితే ఓ మహిళ తన చైన్‌ను రక్షించుకోబోయి దొంగల దాడిలో గాయపడి చికిత్స పొందుతూ మరణించింది. 25 రోజుల పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మకాం వేసిన పోలీసుల స్పెషల్ టీమ్ నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకుంది. అలాంటి దొంగతనాలే మళ్లీ జిల్లాలో ప్రారంభమయ్యాయి. విజయపురం, నగరి, సోమల ప్రాంతాల్లో వరుసగా మహిళల మెడల్లో బంగారు గొలుసులు లాక్కెళ్లారు. దీంతో మహిళలు బయట తిరగాలంటేనే భయపడుతున్నారు.

- సోమల మండలం వంగసానివారిపల్లెకు చెందిన సంపూర్ణమ్మ ఊర్లో నుంచి పొలం వద్దకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరింది. సోమల-పెద్దఉప్పరపల్లె రోడ్డులో వెళ్తుండగా.. ఇద్దరు యువకులు బైకులో వచ్చి ఆమెతో మాటలు కలిపారు. మెడలోని 33 గ్రాముల చైనును లాక్కెళ్లి పోయారు. దీంతో ఆమె సోమల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

- నగరి మండలం అనంతప్పనాయుడు కండ్రిగ సమీపంలో తమిళనాడుకు చెందిన ప్రియ, సెల్వరాజ్ దంపతులు ఎప్పటిలాగే గత ఆదివారం నగరిలోని చర్చికి వచ్చారు. ప్రార్థనలు ముగించుకుని ఇంటికి బైకులో వెళ్తుండగా.. ఇద్దరు యువకులు బైకులో వచ్చి ప్రియ మెడలోని 24 గ్రాముల చైనును లాక్కెళ్లిపోయారు.

- 15 రోజుల కిందట విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద సామరెడ్డికండ్రిగకు చెందిన అనిత నగరికి వెళ్లేందుకు బస్సు కోసం నిల్చొని ఉంది. ఇద్దరు యువకులు హిందీలో మాట్లాడుతూ ఆమె వద్దకు వచ్చి మెడలోని 23 గ్రాముల గోల్డ్ చైను లాక్కెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారిస్తున్నారు.

● ముఠాతో పోరాడి మరణించిన ప్రమీల

ఐరాల మండలం వైఎస్ గేటుకు చెందిన ప్రమీల (55) గతేడాది అక్టోబరు 26న స్కూటీలో పూతలపట్టుకు బయల్దేరింది. చిత్తూరు- పీలేరు హైవేపై తలపులపల్లె వద్ద వస్తుండగా.. ఎదురుగా కేటీఎం బైకులో వస్తున్న ఇద్దరు యువకులు ఆమెను అడ్రస్ కోసమంటూ నిలిపారు. అనుమానం వచ్చిన ప్రమీల మెడలోని చైన్‌ను గట్టిగా పట్టుకుంది. అయినా ఆ దుండగులు ఆమె మెడను గట్టిగా పట్టుకుని లాక్కెళ్లారు. చైన్‌ను మాత్రం తీసుకెళ్లలేకపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆ మహిళ రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతూ మరణించింది.

● కొత్త ముఠానా? పాతదేనా?

గతేడాది జరిగిన వరుస దొంగతనాలకు సంబంధించి చిత్తూరు స్పెషల్ బ్రాంచి పోలీసు బృందం సుమారు 25 రోజుల పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మకాం వేసి అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకుంది. వారిలో శివకుమార్ అనే ముఠా నాయకుడిపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో 40కిపైగా కేసులున్నాయి. ఈ గ్యాంగ్‌ను పట్టుకోవడానికి పోలీసులు చాలా కష్టపడాల్సి వచ్చింది. సమయం కూడా ఎక్కువగా పట్టింది. తాజాగా జరుగుతున్న దొంగతనాలకు, ఆ ముఠాకు సంబంధం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఆ ముఠా వరుస ఘటనలకు పాల్పడుతుంది, పెద్ద చైన్లనే టార్గెట్ చేసుకుంటుంది. తాజా దొంగతనాల్లో పాత ముఠా ఆనవాళ్లు కనిపించడం లేదు.

● గతేడాదిలా పట్టించుకోని పోలీసులు...

గతేడాది చివర్లో జరిగిన వరుస దొంగతనాలు పోలీసులను ఓ రకంగా ఇబ్బంది పెట్టాయి. వరుసగా దొంగతనాలు జరగడం ఓ అంశమైతే, మహిళ ఏకంగా ప్రాణాలు కోల్పోవడం మరో అంశం. అందులోనూ ఆ ముఠా ఎక్కడా ఆనవాళ్లు లేకుండా జాగ్రత్త పడింది. దీంతో జిల్లా కేంద్రంలోని స్పెషల్ బ్రాంచి పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఇప్పుడు జరుగుతున్న దొంగతనాలను పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదని తెలుస్తోంది. నగరి, విజయపురం, సోమల సంఘటనలపై స్థానిక పోలీసులే విచారిస్తున్నారు. గతేడాది తరహాలో తీవ్ర నష్టం జరక్కముందే జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులు దృష్టి సారించి ముఠాను పట్టుకోవాల్సిన అవసరం ఉంది.

డీసీసీబీ లాభాల్లో రైతులకు 2.25 శాతం డివిడెండ్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డీసీసీ బ్యాంకుకు వచ్చిన లాభాల్లో రైతులకు 2.25 శాతం డివిడెండ్‌గా ఇవ్వాలని నిర్ణయించినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహక అధికారి సి. శంకరబాబు తెలిపారు. 2024-25వ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుకు రూ.17.26 కోట్ల లాభాలు(ప్రొవిజినల్ లాభం) వచ్చాయని, ఇందులో రూ.12.76 కోట్లు నికర లాభం వస్తుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఆడిట్ తర్వాత దీనిపై స్పష్టత వస్తుందన్నారు. ఈ మొత్తంలో రూ.1.90 కోట్లు బ్యాంకులో సభ్యత్వం ఉన్న అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘా (సింగిల్ విండోలు)ల్లో ఎ క్లాస్ సభ్యులకు డివిడెండ్ కింద చెల్లిస్తామన్నారు.

● సీఈవో సి. శంకరబాబు



- **రూ.4430 కోట్ల వ్యాపారం :** 2025-26వ ఆర్థిక సంవత్సరంలో రూ.4430 కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో స్వల్పకాలికేతర (ఎస్టీ) రుణాలు రూ.550 కోట్లు, పంట రుణాలు రూ.700 కోట్లు పంపిణీ చేయాలని నిర్ణయించాం. రాష్ట్రంలో మరే డీసీసీబీలో ఇవ్వని విధంగా బంగారం కుదువపై రుణాల రూపేణా రూ.1150 కోట్లు ఇవ్వాలని నిర్ణయించాం. 2024-25లో బంగారం కుదువపై రూ.876కోట్లు వ్యవసాయదారులకు అందించాం. ఇందులో వ్యవసాయ రుణాలుగా రూ.56 కోట్లు, వ్యవసాయేతర రుణాలుగా రూ.820 కోట్లు అందించాం. గత ఆర్థిక సంవత్సరంలో రూ.3450 కోట్ల వ్యాపారం జరిగింది. ఇందులో రుణాల కింద రూ.2436 కోట్లు మంజూరు చేశాం. మిగిలిన రూ.998 కోట్లు డిపాజిట్ల రూపంలో వచ్చాయి.
- **మొండి బకాయిలు :** డీసీసీ బ్యాంకుకు సుమారు రూ.85 కోట్ల వరకు మొండిబకాయిలున్నాయి.వీటిపై ప్రత్యేక దృష్టి పెడతాం. ప్రతి బ్రాంచ్ నుంచి రెండు ఖాతాలకు చెందిన భూములను వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే నిరర్థక ఆస్తులు (ఎన్పీఏ) తగ్గాయి. 2023-24లో ఎన్పీఏ 3.51శాతం ఉంటే, 2024-25 సంవత్సరానికి 3.45 శాతానికి తగ్గింది.
- **డిపాజిట్ల సేకరణ :** డిపాజిట్ల సేకరణపై ఈ ఏడాది ప్రత్యేక దృష్టి సారిస్తాం. దీనివల్ల బ్యాంకుకు సొంత వనరులు సమకూరుతాయి. 2023-24లో రూ.932 కోట్లు, 2024-25లో రూ.998 కోట్లు డిపాజిట్లు సేకరించాం. ఇతర బ్యాంకులతో పోలిస్తే చిత్తూరు డీసీసీబీ నుంచి ఎక్కువ వడ్డీ చెల్లిస్తున్నాం. 333 రోజులకు మహిళలకోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అవని డిపాజిట్ స్కీమ్ కింద 8.50 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్లకు ఇతర బ్యాంకులకన్నా 0.50శాతం వడ్డీ అధికంగా ఇస్తున్నాం. త్వరలో నెట్ బ్యాంకింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

రేపు టెన్త్ ఫలితాలు

'మన మిత్ర'లో చూసుకోవచ్చు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేయనుంది. మార్చి 17 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జిల్లాలో 21,248 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఏప్రిల్ మూడు నుంచి 9వ తేదీ వరకు జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది. ఫలితాలను 'మనమిత్ర' సేవల్లో భాగంగా 95523 00009 వాట్సాప్ నెంబరు ద్వారా ఫలితాలను విద్యార్థులు తెలుసుకోవచ్చు. పీడీఎఫ్ ఫార్మేట్‌లో వివరాలు లభిస్తాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్‌రామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హజ్ యాత్రికులకు నేడు ఉచిత వ్యాక్సినేషన్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు మంగళవారం చిత్తూరు టెలిఫోన్ కాలనీలోని అర్బన్ పీహెచ్‌సీలో ఉచితంగా వ్యాక్సినేషన్ చేయనున్నట్లు డీఐవో హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలు, పెద్దలందరూ కూడా రోగనిరోధక టీకాలు వేసుకోవాలని సూచించారు.

డీఐఈవోగా శ్రీనివాసులు



చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈవో)గా ఎ.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చిత్తూరు బీఎస్ కన్నన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్‌మౌల ఇన్‌చార్జి డీఐఈవో కొనసాగుతున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న క్రమంలో నెల్లూరు జిల్లాలో డీకే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులును రెగ్యులర్ డీఐఈవోగా నియమిస్తూ, కడప ఇంటర్మీడియట్ ఆర్జేడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. రెండ్రోజుల్లో ఆర్జేడీతోపాటు డీఐఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

గ్రీవెన్స్‌లో 95శాతం రెవెన్యూ సమస్యలే



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల గోడు ఆలకిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి


ప్రతి సోమవారం పలమనేరులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కలెక్టర్ సుమిత్‌కుమార్

పలమనేరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) :ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వస్తున్న వినతుల్లో దాదాపు 95 శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే వుంటున్నాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఇందులో డీకేటీ కుటుంబ తగాదాలు, ఆర్ఓఆర్ ఆన్‌లైన్ రికార్డుల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండాగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి రానున్న మూడునెలల పాటు ప్రతి సోమవారం ప్రజాసమస్యల వేదిక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తహసిల్దార్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. న్యాయపరమైన చిక్కులు , కుటుంబ తగాదాల నేపథ్యంలో వినతుల పరిష్కారం ఆలస్యమవుతోందన్నారు. వచ్చే మూడు నెలల కాలంలో పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించి ముఖ్యంగా భూసమస్యల పరిష్కారానికి చర్యలు చూపుతామన్నారు. వినతుల పరిష్కారానికి అధికారులకు సరిపడా సమయం ఇస్తున్నామన్న ఆయన నాణ్యమైన పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. జిల్లాలో పీజీఆర్ఎస్ ద్వారా 53వేల వినతులందగా వాటిలో 12వేల అర్జీలు కుప్పం నియోజకవర్గం నుంచే అందిన క్రమంలో కుప్పంలో పర్యటించి సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. అదే తరహాలో మిగిలిన నియోజకవర్గాల పరిధిలో సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు.ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమ నిర్వహణ పూర్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని, గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇదేవిధంగా అధికార యంత్రాంగాన్ని ప్రజలదగ్గరకు పంపి వారి సమస్యలకు పరిష్కారమార్గం చూపించారన్నారు.పుంగనూరులో గతంలో జమిందారీ వ్యవస్థ ఉండడం, పలమనేరులో కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా రెవెన్యూ సమస్యలు ఉత్పన్నమయ్యాయన్న ఆయన కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు.జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు మొత్తం 428 ఫిర్యాదులను అధికారులు వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు.ఈ ఫిర్యాదుల్లో ఆన్‌లైన్ మ్యూటేషన్‌కోసం 87,పట్టాదారు పాసుపుస్తకాల కోసం 86, భూవివాదాలపై 66,రీ సర్వేపై 37, ఆక్రమణలపై 36, ఆర్వోఆర్‌పై 23, దారిసమస్యలపై 18, ఇళ్లపట్టాలకోసం 16, పెన్షన్స్‌కోసం 14. రేషన్‌కార్డులకోసం 4 అర్జీలు వున్నాయి.ఎస్పీ మణికంఠ,జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డీఆర్వో కె.మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎండల ధాటికి బోసిపోయిన చిత్తూరు దర్గా సర్కిల్



ముదురుతున్న ఎండలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వారం రోజులుగా ఎండలు ముదురుతున్నాయి. అత్యవసర పనులుంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. సోమవారం అత్యధికంగా శ్రీరంగరాజపురం, తవణంపల్లె మండలాల్లో 39.1, అత్యల్పంగా పలమనేరులో 33.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాలవారీగా.. పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పంలో 38.7, గుడిపాల, చిత్తూరులో 38.4, సోమలలో 38.1, సదుంలో 37.8, రొంపిచెర్లలో 37.5, గంగాధరనెల్లూరులో 37.3, యాదమరిలో 36.8, బంగారుపాళ్యం, చౌడేపల్లె, ఐరాల, కార్వేటినగరం, విజయపురం, నగరి, పాలసముద్రం, నింద్ర, పెనుమూరులో 36.7, గుడుపల్లె, శాంతిపురంలో 36.4, గంగవరం, పెద్దపంజాణిలో 35.5, బైరెడ్డిపల్లెలో 34.7, పుంగనూరు, రామకుప్పంలో 34.3, కుప్పం, వి.కోటలో 34.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



అలిపిరిలో వాహనాల బారులు

తిరుమలకు ముఖద్వారమైన అలిపిరి చెక్‌పాయింట్ సోమవారం వాహనాలతో కిక్కిరిసిపోయింది. తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉన్నప్పటికీ అలిపిరి తనిఖీ కేంద్రం మాత్రం వాహనాలతో రద్దీగా మారిపోయింది. సొంతవాహనాల్లో తిరుమలకు వచ్చేవారి సంఖ్య పెరిగిపోవడంతో పాటు ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాలతో పటిష్టమైన భద్రతా తనిఖీలు చేపడుతున్నారు. ఈక్రమంలో అలిపిరి కేంద్రం ముందు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలు క్యూకట్టాయి. గరుడ సర్కిల్ వరకు వాహనాలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారిపోయింది.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. దర్శకుడు గోపిచంద్ మలినేని, సంగీత దర్శకుడు తమన్, హీరో అశ్విన్‌బాబు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


నా పేరు యూనివర్స్



నా పేరు యూనివర్స్ రాజకీయపార్టీ పెడుతున్నా, మద్దతివ్వండి.. అని కోరుతూ సోమవారం ఉదయం తిరుపతిలోని ప్రకాశం పార్కు కూడలి వద్ద ఓ వ్యక్తి ఫ్లెక్సీతో నిలబడ్డారు. కోనసీమ ప్రాంతానికి చెందిన తాను రాజకీయ పార్టీ స్థాపించే నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రాథమికంగా ఈ చర్యకు పూనుకున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం నుంచి మొదలై రెండు వారాలుగా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పర్యటించానన్నారు. ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,746

తలనీలాలు సమర్పించినవారు: 25,078


గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతంలో తాబేళ్ల సంరక్షణ కేంద్రం




సముద్రంలోంచి తీరానికి వచ్చి ఇసుకలో గుంతలోడి ఇలా గుడ్లు పెట్టి మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోతాయి


ఆ గుడ్లను రాత్రి పూట సేకరిస్తారు


వాటిని సంరక్షణ కేంద్రంలో మళ్లీ గుంతలు తీసి పూడుస్తారు

సాగర పర్యావరణ నేస్తాలు

● ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు ట్రీ ఫౌండేషన్, అటవీశాఖల సమష్టి కృషి

సముద్ర పర్యావరణాన్ని సమతల్యం చేసే ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పరిరక్షణకు ట్రీ ఫౌండేషన్ సంస్థ(చెన్నై), అటవీశాఖలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి.జిల్లాలో రెండు సంరక్షణ కేంద్రాల ద్వారా వీటిని కాపాడుతూ సంతోనోత్పత్తి వృద్ధికి దోహదపడుతున్నాయి. చిల్లకూరు మండలం గుమ్మళ్ళదిబ్బ, కోట మండలం శ్రీనివాసస్రతం తీరప్రాంతాల్లో ఉన్న ఈ కేంద్రాలు ఆలివ్ రిడ్లే జాతి తాబేళ్లను కంటికి రెప్పలా చూస్తూ సాగర పర్యావరణ హితానికి పాటుపడుతున్నాయి.


- గూడూరు,ఆంధ్రజ్యోతి


గుడ్లనుంచి పిగిలిన తాబేలు పిల్లలు వెళ్లిపోకుండా గంపలు కప్పి పెడతారు



ఇవీ విశిష్టతలు

- ఆలివ్‌రిడ్లే జాతి తాబేళ్లు సుమారు 100 నుంచి 180 ఏళ్ల వరకు జీవిస్తాయి. ●సుమారు 30 నుంచి 40 కేజీల వరకు పెరుగుతాయి.
- ఎక్కడ పుట్టి సముద్రంలోకి వెళతాయో.. తిరిగి అక్కడికే చేరుకుని గుడ్లు పెట్టడం వీటి విశిష్టత.
- సముద్రంలో సుమారు 2000 కిలోమీటర్లు సంచరిస్తుంటాయి.
- గుడ్లు పెట్టే సమయానికి గుంపులుగా తీరంలో తాము పుట్టిన చోటుకు చేరుకుంటాయి. ●రాత్రి వేళ్ల ఒకటిన్నర అడుగు లోతు మేర గుంటను తవ్వుకుని గుడ్లను పెట్టి తిరిగి సముద్రంలోకి వెళతుంటాయి.
- వీటి గుడ్లు 20-35 డిగ్రీల ఉష్ణోగ్రతను మాత్రమే తట్టుకోగలుగుతాయి.
- పుట్టినపుడు 50 గ్రాముల వరకు వుంటుంది.
- ఆడ తాబేలు 12 నుంచి 15 ఏళ్ల వయసులో గుడ్లు పెట్టడం మొదలుపెడతాయి.



వ్యర్థపదార్థాల వల్ల సమద్రం కలుషితంగా మారుతుంది. దీంతో ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయి. తాబేళ్లు ఈ వ్యర్థపదార్థాలను, లోపలి ఇతర మొక్కలను, పాచిని తింటూ సాగర జలం కలుషితం కాకుండా చూస్తున్నాయి. ఇవి సముద్ర అడుగు భాగాన్ని పరిశుభ్రం చేస్తుంటాయి. దీంతో పలు రకాల చేపలు పరిశుభ్ర వాతావరణంలో తిరుగుతూ సంతాన ఉత్పత్తిని పెంచుకుంటాయి. చిన్నపాటి చేపల జాతులను నాశనం చేసే జెల్లీఫిష్‌లను తాబేళ్లు అంతమొందిస్తున్నాయి. ఫలితంగా ఆ జాతులు కూడా వృద్ధి చెందుతున్నాయి.

తాబేళ్ల పిల్లల పరిరక్షణ

సాగర పర్యావరణ మిత్రులుగా నిలుస్తున్న తాబేళ్ల సంరక్షణకు,వృద్ధికి ట్రీ ఫౌండేషన్, అటవీశాఖ సంయుక్తంగా పాటుపడుతున్నాయి.ఇందులో భాగంగా స్థానిక మత్స్యకారులకు శిక్షణ ఇచ్చి సీ టర్టిల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌గా నియమిస్తున్నాయి. ఈ సిబ్బంది సముద్ర తీరంలో తాబేలు గుడ్లు పెట్టిన చోటును గుర్తిస్తారు. తాబేలు సగటున 80 నుంచి 160 వరకు గుడ్లను పెడుతుంది. వీటిని గుడ్లసంచులలో సేకరించి తాబేలు సంరక్షణ కేంద్రానికి తీసుకువస్తారు. తీరాన ఎంత లోతు, విస్తీర్ణంలో గుడ్లను పెడుతుందో అదేవిధంగా కేంద్రాల్లో తాత్కాలిక గూళ్లను ఏర్పాటు చేసి సంరక్షిస్తారు. 48 నుంచి 52 రోజుల తరవాత గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. 35 డిగ్రీలు కంటే ఎక్కువ ఉష్ణోగ్రత లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. 30 డిగ్రీల లోపు ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఎక్కువ శాతం మగ తాబేళ్లు, 30 నుంచి 33 డిగ్రీల సమయంలో ఆడ తాబేళ్లు పుడతాయి. పుట్టగానే భద్రంగా వీటిని తీసుకువెళ్లి సముద్రంలోకి వదులుతుంటారు. గత ఏడేళ్లలో గుమ్మళ్లదిబ్బ తీరంలో ఇలా 3685, శ్రీనివాసత్రం నుంచి 1500కి పైగా తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలారు. సాధారణంగా ఆలీవ్ రిడ్లే జాతి తాబేళ్లు నవంబరు నుంచి మార్చి వరకు గుడ్లు పెడుతాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సంరక్షణా కేంద్రాల్లో పిల్లలను సముద్రంలోకి వదులుతుంటారు.




తాబేలు పిల్లలను తిరిగి సముంద్రంలోకి వదులుతారు



అరుదైన భూ మూలకాల పరిశోధనతో ప్రగతి

● అంతర్జాతీయ సదస్సులో వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూమి లోపలి అరుదైన మూలకాలు మానవాళి అభివృద్ధికి ఉపయోగపడేలా పరిశోధనలు చేపట్టాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఎస్వీయూ ఫిజిక్స్-పద్మావతి వర్సిటీ బయో టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు సోమవారం పద్మావతి వర్సిటీ ఆడిటోరియంలో ప్రారంభమైంది. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలగకుండా, భూ మూలకాలు తీసి ప్రాసెసింగ్ చేయాలన్నారు. దేశ ప్రగతికి ఇవి ఉపయోగపడేలా చూడాలన్నారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ.. ఆపరేషన్లు చేయడంలో, రోగ నియంత్రణలో మూలకాలు తోడ్పడతాయన్నారు. విక్రమసింహపురి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బోధన, పరిశోధన రంగాల్లో ఈ మూలకాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. థాయిలాండ్ ప్రతినిధి జాక్రపాంగ్ కియోఖో, ఇండోనేషియా ప్రతినిధి మిత్రడిజమల్‌లు మాట్లాడుతూ.. ఈ మూలకాలు సౌరశక్తిని విద్యుత్‌గా మార్చడానికి తోడ్పడుతున్నాయన్నారు. రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు దీపేంద్రసింగ్, ఎంఎల్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షులు సీకే జయశంకర్‌లతో పాటు దేశ, విదేశాలకు చెందిన 200 మంది ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. అతిథులు, ప్రతినిధులను సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాద రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ జాన్‌సుష్మా సత్కరించారు.ఎస్వీయూ, పద్మావతి వర్సిటీల రిజిస్ట్రార్‌లు భూపతినాయుడు,రజని పాల్గొన్నారు.


సదస్సును ప్రారంభిస్తున్న నిఖోనన్ పాథమ్, చిత్రంలో ఎస్వీయూ, పద్మావతి, విక్రమ సింహపురి వర్సిటీ వీసీలు అప్పారావు, ఉమ, శ్రీనివాసరావు, సదస్సు నిర్వాహకులు దేవప్రసాదరాజు, జాన్ సుష్మ

తిరుపతిలో 4 గంటల అంధకారం!

● చంద్రగిరి సబ్ స్టేషన్‌లో కాలిన ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి): ఇంట్లో ఉక్కపోత. బయటకొస్తే దోమల బెడద. కరెంటు సరఫరా లేకపోవడంతో తిరుపతివాసులు సోమవారం సాయంత్రం దాదాపు నాలుగు గంటలకుపైగా సతమతమయ్యారు. తరచూ కరెంటు రావడం.. మళ్లీ పోవడంతో ఇబ్బంది పడ్డారు. చంద్రగిరి 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో 7.30 గంటలకు ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. చంద్రగిరి 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి అలిపిరి సమీపంలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు.. అక్కడ్నుంచి నగరంలోని 33-11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు కరెంటు సరఫరా అవుతోంది. ఈ క్రమంలో తిరుపతితో పాటు చంద్రగిరిలో విద్యుత్ వినియోగం పెరగడంతో 132 కేవీ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులను నియంత్రించే ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో తిరుపతికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు కరెంటు కాసేపు రావడం.. ఆపై సరఫరా ఆగిపోవడంతో జనం ఇబ్బంది పడ్డారు. ఇళ్ల బయటే జాగారం చేశారు. నెల రోజులుగా జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. దీనిని అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారు. ముందస్తుగా 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో స్పేర్‌లో ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచలేదు. విద్యుత్ వినియోగం పెరిగిందని చెబుతున్న అధికారులు.. ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.


ఉక్కపోతకు ఇంట్లో ఉండలేక బయటకొచ్చిన జనం

టీడీపీ నేతపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

రుయాలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌కు శాప్ చైర్మన్ పరామర్శ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలపై దాడులకు, హత్యాయత్నాలకు పాల్పడుతున్న వైసీపీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు కోరారు. వైసీపీ నేతల దాడిలో గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న 1వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్‌ను సోమవారం టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీ యూఎఫ్ఐడీసీ చైర్మన్ పూకా విజయ్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్ అండదండలతో వైసీపీ నేతలు దాడులకు, హత్యాయత్నాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని టీడీపీ నేతలను భయభ్రాంతులకు గురిచేయాలనే ఆలోచనతోనే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చిల్లర రాజకీయాలు ఎన్ని చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. వైసీపీ దాడులకు, బెదిరింపులకు టీడీపీ నేతలు భయపడరని స్పష్టం చేశారు. నరసింహయాదవ్, మునికృష్ణ మాట్లాడుతూ ప్రశాంతమైన తిరుపతిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రుయాకు చేరుకొని వెంకటేష్‌ను పరామర్శించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు శంకర నారాయణ పాల్గొన్నారు.


వెంకటేష్‌ను పరామర్శిస్తున్న రవినాయుడు, టీడీపీ నేతలు



చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రవి నాయుడు, డీఎస్సీ అభ్యర్థులు

ఆరేళ్ల కల నిజమాయె

డీఎస్సీపై చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తిరుపతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ అభ్యర్థుల ఆరేళ్ల కలను సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి లోకేశ్ సాకారం చేశారని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీని విడుదల చేసి ఇది మంచి ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుందన్నారు. డీఎస్సీ విడుదల సందర్భంగా తిరుపతి ఆర్డీవో ఆఫీసు ఎదుట డీఎస్సీ అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి సోమవారం చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 'థ్యాంక్యూ సీఎం సర్, లోకేశ్ అన్న' అంటూ డీఎస్సీ అభ్యర్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. రవినాయుడు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఇదే ప్రాంతంలో నిరసనలు, ధర్నాలు చేపట్టామని, కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. అన్ని కేటగిరీలకు న్యాయం జరిగేలా ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ డీఎస్సీ విడుదల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని, చెప్పినట్టుగానే 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. ఇప్పటికైనా మాజీ సీఎం జగన్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, రాష్ట్ర సభ్యులు ఆర్కే నాయుడు, విష్ణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక మెడికల్ క్యాంపు

తిరుపతి(విద్య), ఏప్రిలల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రత్యేక మెడికల్ క్యాంపును తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్ 2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్ పొందాల్సిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా మెడికల్ క్యాంపునకు హాజరుకావాలని సూచించారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు రుయా ఆసుపత్రిలో పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి, సంబంధిత వైద్యులతో పరిశీలన చేయించుకుని కొత్త సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. వీటి ఆధారంగానే బదిలీల్లో ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.

వాచీల ఈ-వేలం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను మే 1, 2 తేదీల్లో ఈ-వేలం నిర్వహించనున్నారు. టైటాన్, సిటిజన్, సొనాట, రాగా, టైమ్స్, టైమెక్స్ ఇతర కంపెనీల స్మార్ట్ వాచీలు 62 లాట్లు కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్నవి ఉన్నాయి. ఇతర వివరాలకు తిరుపతిలోని మార్కెటింగ్ కార్యాలయం 0877- 2264429, టీటీడీ వెబ్‌సైట్, రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్‌ను సంప్రదించాలని టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'కు 258 అర్జీలు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి మొత్తం 258 అర్జీలు అందాయి. వీటిల్లో.. రెవెన్యూశాఖకు 213, డీఆర్‌డీఏకు 26, పోలీసుశాఖకు 6, డీఎస్వోకు 4, హౌసింగ్‌కు 3, మిగిలినశాఖలకు ఆరు అర్జీల చొప్పున ఉన్నాయి.

ఉద్యోగ భద్రత కల్పించండి: ఫీల్డ్ అసిస్టెంట్లు

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. అధికారులకు వినతిపత్రమిచ్చాక ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నామలై మీడియాతో మాట్లాడారు. 2016 నుంచి పనిచేస్తున్న వారిలో కొందరిని ఎటువంటి కారణం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకుంటే ఈనెల 28వ తేదీనుంచి విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు.



ఏఆర్ పోలీసు కార్యాలయానికి 55 అర్జీలు

జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి ఏఎస్పీ రాజశేఖర రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబు అర్జీలను స్వీకరించారు. మొత్తం 55 వినతులు అందాయి. వీటిల్లో.. సైబర్ క్రైమ్‌పై 1, ప్రేమ వివాహంపై 2, వేధింపులపై 2, ఫోర్జరీపై 2, భర్త వేధింపులపై 2, చీటింగ్‌పై 3, కుటుంబ తగాదాలపై 3, దారి తగాదాలపై 3, డబ్బు తగాదాలపై 8, ఆస్తి తగాదాలపై 9, భూ తగాదాలపై 20 చొప్పున ఉన్నాయి.

కార్యాలయం వెలుపలకొచ్చి దివ్యాంగురాలి అర్జీని పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజశేఖర రాజు

తీర్థయాత్రలో విషాదం

- చెట్టును ఢీకొన్న కారు
- ఒకరి మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు
- నలుగురికి స్వల్పగాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు



హరినాథ్ మృతదేహం



కుప్పం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తరుణ్

రామకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్ర విషాదంగా మారింది.. యాత్ర ముగిసి ఇంటికి వచ్చే సమయంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, ఏడుగురు గాయపడ్డారు. వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు... పీలేరుకు చెందిన హరినాథరెడ్డి(47), మదనపల్లెకు చెందిన నాగరాజు(43) అన్నదమ్ములు. ఈ నెల 17న వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి తమిళనాడు తీర్థయాత్రకు వెళ్లారు. ఆదివారం తీర్థయాత్రను ముగించుకుని ఇన్నోవా కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని రామకుప్పం మండలం బూరుగుమాకులపల్లె క్రాస్ వద్ద సోమవారం తెల్లవారుజామున వారు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కనున్న నీలగిరి చెట్టును ఢీకొంది. వాహనాన్ని నడుపుతున్న నాగరాజు నిద్ర మత్తుతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో హరినాథరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. నాగరాజుతో బాటూ అతని భార్య మన్మదకుమారి, కుమార్తెలు ఝాన్సీ, హర్షితకు తీవ్రగాయాలయ్యాయి. హరినాథరెడ్డి భార్య రెడ్డెమ్మ, కుమారులు తరుణ్, స్వరూప్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది క్షతగాత్రులను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన వారిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తరుణ్ ఫిర్యాదు మేరకు నాగరాజుపై కేసు నమోదు చేశారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.71 కోట్లు



ఆలయ ఈవో పర్యవేక్షణలో హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,71,77,943 లభించింది. సోమవారం ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఆదాయంలో 309 యూఎస్ఏ, 50 కెనడా, 5 ఆస్ట్రేలియా డాలర్లతోపాటు 165 గ్రాముల బంగారు, 1,350 గ్రాముల వెండి లభించింది. గోసంరక్షణ హుండీ ద్వారా రూ.13,814, నిత్యాన్నదాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.42,436 సమకూరాయి. ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



కంపెనీ ముందు రైతుల నిరసన

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మ్యాంగో ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ సీఈవో ఆనందనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కంపెనీ కార్యాలయం ముందు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం కంపెనీ కార్యాలయానికి తాళాలు వేయడంపై రైతులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆనందనాయుడు మాట్లాడుతూ.. కంపెనీలో 643 మంది రైతులు రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టారని చెప్పారు. వీరి డబ్బులు ఇవ్వకపోగా, కంపెనీ ఛైర్మన్ మునిచంద్రనాయుడు ప్రవర్తనకు రైతులు విసిగి పోయారన్నారు. కంపెనీని కాపాడుకునేందుకు పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసుకుని పోరాటం చేస్తున్నామని తెలిపారు. నిరసనలో కోకన్వీనర్ హరిబాబు, రైతులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, ముకుంద తదితరులు పాల్గొన్నారు. దీనిపై ప్రస్తుత సీఈవో శివప్రసాద్ వివరణ ఇస్తూ.. కంపెనీలో ఎలాంటి మోసం జరగలేదని చెప్పారు. రైతుల షేర్లు కేవలం రూ.16.70 లక్షలు ఉన్నాయన్నారు. కంపెనీని నమ్మి 43 మంది రైతులు సాగు చేసిన మామిడి పల్ప్ చేయడానికి తాము సిఫారసు చేసిన ఎస్ఆర్‌పురం మండలం పిల్లారికుప్పంలోని 'వెబ్ బై నేచర్' ఫ్యాక్టరీకి ఇచ్చారన్నారు. ఆ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి తమకు రావాల్సిన బకాయిలను వసూలు చేసి రైతులకు అందజేస్తామని తెలిపారు.

బెట్టింగ్ ఆడొద్దు.. ప్రాణాలు పోగొట్టుకోవద్దు

- యువతకు అవగాహన కల్పించడానికి పలమనేరు యువకుడి సైకిల్ యాత్ర



చిత్తూరుకు చేరుకున్న బషీర్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 'యువతా.. బెట్టింగ్ ఆడొద్దు.. ప్రాణాలు పోగొట్టుకోవద్దు' అంటూ పలమనేరుకు చెందిన టైలర్ బాషా కుమారుడు బషీర్ సైకిల్ యాత్ర చేపట్టాడు. 'ప్రపంచ ప్రయాణికుడు' పేరుతో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేమసైన ఈ యువకుడు.. బెట్టింగ్ ఉచ్చులో యువత చిక్కుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పించడానికి సోమవారం తిరుపతిలో సైకిల్ యాత్ర ప్రారంభించారు. రాత్రి ఏడు గంటలకు చిత్తూరుకు చేరుకున్న బషీర్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి పలుకరించింది. ఆయన మాటల్లోనే.. 'ప్రస్తుతం చాలామంది యువత బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి.. విలువైన జీవితాలను పోగొట్టుకుంటోంది. దీన్ని నివారించడానికి రాష్ట్రంలోని అన్ని మండలాల్లో తిరుగుతూ సుమారు 4నెలల పాటు సైకిల్ యాత్ర చేస్తాను. గత ఏడాది డ్రగ్స్‌పై అవగాహన కోసం పలమనేరు నుంచి లడక్ వరకు సుమారు 3,500 కిలోమీటర్లు రెండు నెలలపాటు సైకిల్ యాత్ర చేశాను. యూట్యూబర్ అన్వేష్ స్ఫూర్తితో ఈ యాత్ర చేపట్టాను. ప్రస్తుత నా యాత్రకు రూ.1.75 లక్షల సైకిల్‌ను కూడా అన్వేష్ ఉచితంగా అందించారు' అని బషీర్ వివరించారు.

మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

- డీఎస్సీ ప్రకటనపై ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ విడుదలతో ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చుడా ఛైర్ పర్సన్ కటారి హేమలత సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయడం శుభపరిణామమని వివరించారు.

తల్లిని తండ్రి కొట్టాడని కుమార్తె ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): తల్లిని తండ్రి కొట్టాడని కుమార్తె ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన ఆదివారం రాత్రి పుంగనూరు మండలంలో జరిగింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. మండలంలోని బండ్లపల్లె పంచాయతీ బుద్రావారిపల్లెకు చెందిన గంగాధర్, గుర్రమ్మ దంపతులు. వీరికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. మగపిల్లలు లేరని భర్త రోజూ తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి కూడా మద్యం మత్తులో భార్యను కొడుతుండగా 6వ తరగతి చదువుతున్న కుమార్తె పూజిత అడ్డుకుంది. దీంతో కుమార్తెను కూడా కొట్టాడు. మనస్తాపం చెందిన పూజిత ఇంట్లోని చీమల మందు తాగేసింది. తల్లి గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎస్ఏ సీనియారిటీ జాబితాపై 24లోపు అభ్యంతరాలు తెలపండి

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జోన్‌లోని ఎస్ఏ (స్కూల్ అసిస్టెంట్)ల నుంచి గ్రేడ్ టూ హెచ్ఎంగా సవరించిన సీనియారిటీ జాబితా ఆర్జేడీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు కడప ఆర్జేడీ శామ్యూల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలోని అభ్యంతరాలను ఆధారాలతో 24వ తేదీలోపు సంబంధిత డీఈవో కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు.

మామిడి కాయల పక్వానికి కాల్షియం కార్బైడ్ వాడడం నేరం: జేసీ

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మామిడి కాయలను పండుగా మార్చడానికి వినియోగించే కాల్షియం కార్బైడ్ అమ్మడం, నిల్వ లేదా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని జేసీ విద్యాధరి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తనిఖీల సమయంలో పట్టుబడితే సెక్షన్ 44(ఏ) ప్రకారం మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. మామిడి కాయలు కోశాక పండుగా మారడానికి వారం రోజులు పడుతుందన్నారు. రసాయనాలతో కాయ త్వరగా పక్వానికి వచ్చేలా సరికాదని, ఇలాంటివి పండ్లను తింటే ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు.

28నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న రామకృష్ణమిషన్ ఆశ్రమంలో ఈనెల 28నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు 'సంస్కార శిబిరం' పేరిట పిల్లలకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ ప్రతినిధి శ్రీకాంత్ మహరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాసనాలు, ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్, భజనలు, సంస్కృత శ్లోకాలు, శ్రీమద్ భగవద్గీత, పూలమాల తయారీ విధానం, భారత సనాతన సంస్కృతి, కర్రసాము, విలువిద్య, వ్యక్తిత్వవికాసం వంటి వాటిలో ఉదయం 8.15 నుంచి మధ్యాహ్నం 12.15వరకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 5 నుంచి 10వ తరగతి బాలబాలికలు మాత్రమే అర్హులని వివరించారు. ముందు వచ్చినవారికి ముందు ప్రాధాన్యత ప్రాతిపదికన పేర్లను నమోదు చేసుకుంటారని, పూర్తిగా శ్వేత వస్త్రధారణతో రావాల్సి ఉంటుందని వెల్లడించారు. రూ.1,200 రుసుం చెల్లించాల్సి ఉంటుందని, ఉదయం ఉపాహారం అందజేస్తారని, మరిన్ని వివరాలకు 9493107001, 6360150945లను సంప్రదించాలని కోరారు.

ఎస్వీయూ డిగ్రీ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ నెల 22, 23 తేదీల్లో జరగాల్సిన ఈ పరీక్షలను మే 12, 14వ తేదీలకు వాయిదా వేశారు. 24వ తేదీ నుంచీ జరిగే పరీక్షలను యథావిధిగా నిర్వహిస్తామని పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

24 నుంచి పీజీ పరీక్షలు

ఎస్వీయూ పరిధిలో పీజీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచీ ప్రారంభం కానున్నాయి. మే ఒకటో తేది దాకా కొనసాగుతాయి. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

ఎండుగడ్డి కట్ట రూ.200



వాహనంలో ఎండుగడ్డి కట్టలు

పాలసముద్రం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఒకటిన్నర నెలలుగా ఎండలు మండుతుండటంతో పశువులకు పచ్చిగడ్డి లభించడం లేదు. దాంతో ఎండుగడ్డికి డిమాండ్ ఏర్పడింది. దీన్నే తమిళ తంబీలు సొమ్ము చేసుకుంటున్నారు. ఎండుగడ్డి కట్ట ఒకటి రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. రోజూ నాలుగైదు ట్రాక్టర్లు, వ్యాన్లలో ఎండుగడ్డి కట్టలను తమిళనాడు వ్యాపారులు పాలసముద్రం మండలానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. వేసవి దృష్ట్యా సబ్సిడీ ధరలతో దాణా, గడ్డి సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని పాడి రైతులు కోరుతున్నారు.

పీఎఫ్ రుణాలు త్వరగా

మంజూరు చేయించండి: ఎస్టీయూ



జడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాలు ఆలస్యం చేయకుండా మంజూరు చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జడ్పీ చాంబర్‌లో సీఈవో రవి కుమార్‌నాయుడిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చెందినవారి ఫైనల్ పేమెంట్లు వెంటనే సెటిల్ చేయాలని కోరారు. అలాగే ఇంటి స్థలాలు కొనుగోలుపై మంజూరుచేసే రుణాలకు మూల పత్రాలు అడుగుతున్నారని, అలాకాకుండా గతంలో వలెనే ఇచ్చేలా చూడాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి, నాయకులు గుణశేఖర్, సుబ్రహ్మణ్యం, దయ, రామలింగారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సంజీవి, ముని, కన్నయ్య పాల్గొన్నారు.

తిరుమలకు వెళుతున్నారా?

- వాహన చోదకులూ జాగ్రత్తలు తీసుకోండి
- కార్ల దగ్ధం నేపథ్యంలో తిరుపతి ఎస్పీ సూచన

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్లలో వస్తున్నారా? అయితే కార్ల యజమానులు, డ్రైవర్లు అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధనరాజు సూచించారు. ఇటీవల రెండు కార్ల దగ్ధం నేపథ్యంలో డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇటీవల ఎండా కాలంలో తిరుమలకు వస్తున్న రెండు కార్లు దగ్ధమయ్యాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇలా కార్లు కాలడానికి కారణాలపై నిపుణులను సంప్రదించగా పలు కారణాలు చెబుతున్నారు. సుమారు 500 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఇంజన్ అప్పటికే వేడిగా ఉంటూ ఒత్తిడిలో ఉంటుంది. ఆ వెంటనే తిరుమల ఘాట్ ఎక్కడం ప్రారంభిస్తే ఇంజన్, ట్రాన్స్‌మిషన్‌కు అధిక వేడి వస్తుంది. దీంతో పాటు వంకర రోడ్లు, ఘాట్ రోడ్డు ఎక్కాలంటే అధిక ఇంజన్ శక్తి అవసరం. డ్రైవర్లు ఎక్కువగా తక్కువ గేరులో వెళుతుంటారు. దీనివల్ల ఆర్‌పీఎం పెరిగి వేడి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలూ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. తీర్థ యాత్రల్లో బరువు బ్యాగులు, ఎక్కువ మందిని తీసుకెళ్ళడం సాధారణం. పాత వాహనాలు, సరిగా సర్వీసు చేయని వాహనాల్లో కూలెంట్ లీక్‌లు, తక్కువ స్థాయి కూలెంట్ ఉండడం, పాడైన రేడియేటర్లు లేదా ఫ్యాన్లు, థెర్మోస్టాట్ లోపాలు, పాడైన ఇంజన్ ఆయిల్ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. టూర్‌కు వచ్చే ముందుగా బండిని సర్వీసింగ్ చేయించాలి. రేడియేటర్ లీకేజీలు తనిఖీ చేయాలి. ఫ్యాన్ బెల్టు సరిచూసుకోవాలి. బ్యాటరీల్లో డిస్టిల్ వాటర్ తనిఖీ చేయడం చాలా ముఖ్యం. ప్రతి రెండు గంటలకు ఒకసారి అయిదు నిమిషాల పాటు వాహనం ఆపాలి. వాహనాల డ్యాష్ బోర్డుల మీద థర్మామీటర్, ఆయిల్ గేజ్ మీటర్ పరిశీలిస్తుండాలి. ఘాట్ ఎక్కే సమయంలో ఏసీ ఆఫ్ చేయాలి' అని ఎస్పీ హర్షవర్ధనరాజు వివరించారు.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

తిరుపతి (సెంట్రల్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చెంగల్‌పట్టు-కాచిగూడ మధ్య రాకపోకలు సాగించే కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు రేణిగుంట రైల్వే జంక్షన్‌లో రెండు రోజుల క్రితం పెను ప్రమాదం తప్పినట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి చెంగల్‌పట్టు నుంచి కాచిగూడకు వెళుతున్న కాచిగూడ ఎక్స్‌ప్రెస్(17651) నిర్ణీత సమయానికి రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. తిరిగి 8 గంటలకు బయలుదేరిన ఈ రైలు 5వ నంబరు ప్లాట్‌ఫారం నుంచి కడప వైపు వెళ్లాల్సి ఉంది. అయితే విజయవాడ మార్గంలోకి మళ్లింది. స్టేషన్ యార్డు దాటుతున్న సమయంలో డ్రైవర్ ఈ విషయాన్ని గ్రహించి రైలు నిలిపి స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు స్పందించి దారి తప్పిన రైలును తిరిగి 5వ నెంబరు ప్లాట్‌ఫారానికి రప్పించి, కడప మార్గం నుంచి పంపినట్లు తెలిసింది. ఈ కారణంగా బెంగళూరు-బాగల్‌పూర్, చెన్నై-ముంబయి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు ఆలస్యమయ్యాయి. దీనిపై వివరణ కోసం ప్రయత్నించగా అధికారులు స్పందించలేదు. కాగా, రైలు దారి తప్పిన సమయంలో విజయవాడ మార్గంలో మరో ఎక్స్‌ప్రెస్ వచ్చివుంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు.

మెగా డీఎస్సీ విడుదలతో

నిరుద్యోగుల కళ్లలో ఆనందం: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ విడుదలతో నిరుద్యోగుల కళ్లలో ఆనందం కనిపిస్తోందని టీడీపీ నేతలు అన్నారు. సోమవారం చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ నేతృత్వంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో పండుగ వాతావరణం కనిపిస్తోందని చెప్పారు. నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వయోపరిమితిని కూడా ఓసీ, బీసీలకు 44 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీలకు 49 సంవత్సరాలు, వికలాంగులకు 54 సంవత్సరాలకు పెంచడంతో వారి ఆనందానికి అవధుల్లేవని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు వెంకటేష్ యాదవ్, మోహన్‌రాజ్, మేషాక్, ధరణి ప్రకాష్, యువరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

24నుంచి టీచర్లకు రుయాలో వైద్య పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద స్పెషల్ పాయింట్లు పొందాల్సిన టీచర్లు ఈనెల 24 నుంచి 26వ తేదీవరకు తిరుపతి రుయాస్పత్రిలో నిర్వహించే మెడికల్ క్యాంపునకు హాజరు కావాలని డీఈవో వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక వైకల్యం, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, అవయవమార్పిడి, మేజర్ న్యూరోసర్జరీ, ఎముకల్లో టీబీ, కిడ్నీ మార్పిడి, స్పైన్ సర్జరీ, మానసికంగా బాధపడుతున్న భార్యభర్తలు, జువైనల్ డయాబెటిస్, తలసేమియా, హిమోఫిలియా తదితర బాధిత టీచర్లు వైద్య పరీక్షల నిమిత్తం బుధవారం డీఈవో కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే వైద్యపరీక్షలకు హాజరై, ఆధారాలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

బస్సు ఢీకొని మదరసా టీచర్ దుర్మరణం



పలమనేరు, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మదరసాలో పనిచేసే టీచర్ మృతిచెందాడు. పలమనేరుకు చెందిన సుహేల్(35) మదరసాలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద ఉన్న మదరసాకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా తమిళనాడుకు చెందిన బస్సు ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితుల గ్రామ బహిష్కరణ అన్యాయం



బస్టాండులో ధర్నా చేస్తున్న దళిత నాయకులు

చౌడేపల్లె, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో దళితులను గ్రామబహిష్కరణ చేయడం దుర్మార్గమని కేవీపీఎస్ నాయకులు వాసు పేర్కొన్నారు. గ్రామబహిష్కరణకు ఖండిస్తూ సోమవారం స్థానిక బస్టాండ్‌లో ధర్నా చేశారు. దళితులను గ్రామబహిష్కరణ చేసి, టీ, పాలు, కిరాణ దుకాణాల నుంచి బహిష్కరిండం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, చంద్ర, హరిబాబు, రాఘవ, కృష్ణప్ప పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చౌడేపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలంలో గడ్డివామి దగ్ధమైంది. కాగతికి చెందిన గంగులప్ప తన ఇంటి సమీపంలో వరి గడ్డిని వామివేసి నిల్వ ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్లు తాగి నిప్పు ఆర్పకుండా పడేయటంతో గడ్డివామిలో మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు గుర్తించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందిచారు. అగ్ని మాపక అధికారి సుబ్బరాజు తన సిబ్బంది, గ్రామస్థులతో కలసి మంటలు అదుపు చేశారు. అప్పటికే రూ.20 వేలు విలువైన గడ్డి కాలిబూడిదైంది.

కందూరులో పారిశుధ్యంపై కళాజాత



సోమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందూరులో పారిశుధ్యంపై కళాజాత బృంద సభ్యులచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల శుభ్రత, డంపింగ్ కేంద్రానికి చెత్త తరలింపు, వర్మీకంపోస్టు తయారీ తదితర అంశాలపై కళాకారులు అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసే విధానాలను వివరించారు. పారిశుధ్యంపై ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



మోడల్ స్కూల్లో తనిఖీలకు వచ్చిన అకడమిక్ మానిటరింగ్ అధికారి క్రిష్ణవేణి

రొంపిచెర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని మోడల్ పాఠశాలలో సోమవారం 6వ తరగతి ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ సరళ తెలిపారు. ఆరో తరగతి ప్రవేశాలకు 99 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 82 మంది పరీక్షలకు హాజరైనట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి క్రిష్ణవేణి సందర్శించారు. ఆమె వెంట ఎంఈవో శ్రీనివాసులు ఉన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన సోమవారం అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో చోటు చేసుకుంది. రామసముద్రం మండలం కురిజల గ్రామానికి చెందిన శ్రీరాములు, మునిలక్ష్మి దంపతులు. వీరు వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తుండేవారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో మునిలక్ష్మి పురుగుమందు తాగింది. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం మిట్టపల్లె మార్గంలో సోమవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మిట్టపల్లెకు చెందిన రంగయ్య కుమారుడు నరసింహులు(22) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి చౌడేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎన్వీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం చదళ్ల గ్రామ సమీపంలో వెలసిన చౌడేశ్వరిదేవి వార్షికోత్సవ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎన్వీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో వార్షికోత్సవ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ బుధవారం నుంచి శుక్రవారం వరకు ఆలయంలో నిత్యపూజలు, హోమాలు, అలంకరణలు, మహామంగళహారతులు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలియజేశారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి



పుంగనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. అర్చకులు బాలసుబ్రహ్మణ్యం శర్మ, రామచంద్రస్వాములు కాశీవిశ్వేశ్వర స్వామికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనలు, పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



పుంగనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు బీజేపీ నాయకులు ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ఓ హోటల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీశ్‌రాజు మాట్లాడుతూ జాతీయ పౌర సేవా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లికారాణి, మణిమొదలియర్, జగన్నాథం, ప్రసాద్, చంద్రశేఖర్‌రాజు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సోమల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ వంగసానివారిపల్లెకు చెందిన మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన సంపూర్ణమ్మ సోమవారం మధ్యాహ్నం పొలం వద్ద ఉండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి మాటలు కలిపారు. అకస్మాత్తుగా ఆమె మెడలోని రూ.4లక్షల విలువైన 38 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు సోమల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

గుడుపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ ఫీజు చెల్లింపుకు నేడు ఆఖరు తేదీ అని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణమ నాయుడు తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మే 12 తేదీ నుంచి 20 వరకు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరుగుతాయని వివరించారు.

రేపు రాజుపేటలో శ్రీరామకోటి నామస్మరణ

రామకుప్పం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం రాజుపేటలోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గ్రామస్థులు తెలిపారు. బుధవారం ఉదయం 7గంటలకు చెల్దిగానిపల్లెకు చెందిన రామకోటిరామన్న నేతృత్వంలో కలశస్థాపన, అనంతరం శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గురువారం ఉదయం 7గంటలకు కార్యక్రమం ముగింపు సందర్భంగా మహామంగళహారతి జరుగుతుందన్నారు. ఈ రెండు రోజులు ఆలయంలో ప్రత్యేక అభిషేకపూజలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

జనసేనలోకి వైసీపీ యువత



కుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి నరేశ్ ఆధ్వర్యంలో సోమవారం వైసీపీ నుంచి 15 మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా జన సైనికులు పనిచేయాలని కోరారు.

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

రామకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గెర్నిపల్లెలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ వెంకటమోహన్ కథనం మేరకు.. గెర్నిపల్లెకు చెందిన పవన్‌రెడ్డి తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం నిల్వ ఉంచుకున్నట్టు సోమవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేసి అతని ఇంటి వద్ద 10 బీరుబాటిళ్లు, 23 మద్యం టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడు పవన్‌రెడ్డిని అరెస్టు చేశారు. రిమాండుకు తరలించారు.

రైతు ఆత్మహత్య

సోమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సోమల - సదుం మార్గంలోని అభయాంజనేయ ఆలయం సమీప టమోటా తోట వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. సోమల సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎం.శ్రీనివాసులు కుమారుడు ఎం.మునీంద్ర (50) సోమవారం పొలం వద్ద ఎవరూలేని సమయంలో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. మునీంద్ర పొలాన్ని కౌలుకు తీసుకున్న కలకడకు చెందిన వారు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మృతుడి భార్య కొంతకాలం క్రితం ఇతడితో విభేదించి వెళ్లిపోయింది. తల్లి పెరాలసిస్‌తో బాధపడుతోంది. ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆర్థికసమస్యలు వెంటాడడంతో ఆత్మహత్య చేసుకుని ఉండచ్చని స్థానికులు భావిస్తున్నారు.

టీడీపీ పటిష్టతే ధ్యేయం: గౌనివారి



కెంచనబల్లలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో ఎన్నికైన పంచాయతీ కమిటీ, అనుబంధ కమిటీ ప్రతినిధులు పార్టీ పటిష్టతే ధ్యేయంగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. సోమవారం కెంచనబల్ల, మణీంద్రం యూనిట్ల పరిధిలోని పంచాయతీ పార్టీ కమిటీల ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే పరమావధిగా పలు కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిరంతరం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. స్థానిక ఎన్నికలలో ఘనవిజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, నేతలు రామ్మూర్తి, మహ్మద్‌రఫీ కృష్ణానాయక్, విశ్వనాథ్, వెంకటాచలం, మనోహర్, జయశంకర్,గజేంద్ర, గుర్రప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, సత్తి, గుణశేఖర్, కృష్ణప్ప, రామలింగారెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషిచేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథనాయుడు

శాంతిపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పదవులు పొందిన ప్రతి ఒక్కరూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు అన్నారు. సోమవారం కడపల్లె, కర్లగట్ట, 64పెద్దూరు, సి.బండపల్లె గ్రామ పంచాయతీల టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు జరిగాయి. కుప్పం మండల మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. కడపల్లె పంచాయతీ పార్టీ అధ్యక్షుడుగా బీరేష్‌గౌడు, కార్యదర్శిగా చంద్ర, కర్లగట్ట పంచాయతీకి ఆటో మురుగేష్, కార్యదర్శిగా గంగరాజు, కడపల్లె యూనిట్ ఇంచార్జిలుగా పెద్దన్న, కర్లగట్ట యూనిట్ ఇన్‌చార్జిగా గిరిధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 64 పెద్దూరు, సి బండపల్లె గ్రామ కమిటీలకు నేతలు పోటీ పడడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు విజయరామిరెడ్డి, ఏఎంసీ నాగరాజు, రాళ్ళబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, టీడీపీ నేతలు ఆర్‌ఎస్ మణి, క్యాబేజి మురళీ, మంజునాథ్, గోవిందరాజులు, దొరస్వామి, గోపాల్, రుద్రప్ప, సుగునమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యత



యామిగానిపల్లె గ్రామ కమిటీ ఎన్నికల్లో మాట్లాడుతున్న బాబునాయుడు

గుడుపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యత పార్టీ కల్పిస్తుందని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, మండలాధ్యక్షుడు బాబు నాయుడు, వన్నెకుల సాధికారిక అధ్యక్షులు మునిరాజు పేర్కొన్నారు. సోమవారం యామిగానిపల్లె, అగరం, కుప్పిగానిపల్లె, దాసిమానిపల్లె, పొగురుపల్లె పంచాయతీల్లో గ్రామ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా డాక్టర్ సురేష్ బాబు, శరవణ, నారాయణ రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామ స్థాయిలో పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్తను పార్టీ ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బేటప్పనాయుడు, వెంకటేష్, భానుమూర్తి, సుబ్రహ్మణ్యం, అరుణాచలం, శ్రీనివాసులు, గోవిందస్వామి, ఉదయ్‌కుమార్, చంద్రప్ప, వెంకటరాముడు, యుగంధర్‌రెడ్డి, గోపి, బేటప్ప, రామచంద్ర తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ పంచాయతీ అధ్యక్షుల ఎన్నిక

పలమనేరు, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలంలోని ఐదు పంచాయితీలకు సోమవారం గ్రామ కమిటీ పంచాయితీ కమిటీలను ఎన్నుకొన్నారు. జగమర్ల పంచాయితీ అధ్యక్షులుగా కోదండరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాబు, కొలమాసనపల్లి పంచాయితీ కమిటీ అధ్యక్షులుగా పి. హేమసుందర్, ప్రధాన కార్యదర్శిగా బాలచందర్‌రెడ్డి, జరావారిపల్లి అధ్యక్షులుగా కె.అమరనాథరెడ్డి, ప్రధానకార్యదర్శిగా మురళి, పెంగరగుంట అధ్యక్షులుగా రామచంద్రనాయుడు, ప్రధానకార్యదర్శిగా రఘునాయుడు, కూర్మాయి అధ్యక్షులుగా బాబురెడ్డి, ప్రధానకార్యదర్శిగా మల్లికార్జునలను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నాగరాజరెడ్డి, కార్యదర్శి గణేష్, సీనియర్ నాయకుడు జగదీష్‌నాయుడు, పెద్దబ్బ, అమరనాథరెడ్డి, రామ్మూర్తి నాయుడు, బాలాజి నాయుడు, జయప్రకాష్, స్వతంత్రబాబు, వెంకటమునిరెడ్డి, గిరిబాబు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



సీఐ, ఎస్‌ఐలు గంటల వ్యవధిలోనే బిడ్డను తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పుంగనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పుంగనూరు వారపు సంతలో సోమవారం తప్పిపోయిన ఆరేళ్ల బాలికను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక కొత్తపేటకు చెందిన కిశోర్ భార్య శోభారాణి తన ఆరేళ్ల కుమార్తెను తీసుకుని సంతకు వెళ్లింది. శోభారాణి కూరగాయలు, నిత్యావసర వస్తువులు తీసుకుంటుండగా బాలిక కనిపించలేదు. తల్లి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియరాలేదు. పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో బిడ్డ తప్పిపోయినట్లు ఫిర్యాదు చేసి పాప ఫొటో ఇచ్చారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ లోకేశ్ వారి సిబ్బందితో గాలించారు. స్థానిక ఎంబీటీ రోడ్డులో కనిపించడంతో స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

వేతన బకాయిలు చెల్లించండి

● పీడీకి మధ్యాహ్న భోజన కార్మికుల వినతి



వినతులు స్వీకరిస్తున్న పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ విద్యాసంస్థల్లోని మధ్యాహ్న భోజన కార్మికులు కడా పీడీ వికాస్ మర్మత్‌కు విన్నవించారు. కుప్పం మండల సచివాలయంలో పీడీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఇందులో మధ్యాహ్న భోజన కార్మికులు పీడీతో మాట్లాడుతూ వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. అలాగే వేతనాలను పెంచాలని కోరారు. విధులనుంచి తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలన్నారు. భవిష్యత్తులో ఎవరినీ ఉద్యోగం నుంచి తొలగించరాదని కోరారు. దీనిపై పీడీ వికాస్ మర్మత్ స్పందిస్తూ పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మొత్తం 25 వినతులు

కడా పీడీకి ప్రజల నుంచి మొత్తం 25 అర్జీలు అందాయి. ఇందులో 17 రెవెన్యూ, 1 హౌసింగ్, 4 సర్వే సెటిల్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్, 3 పోలీసు సంబంధమైనవి ఉన్నాయి. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పీడీ భరోసానిచ్చారు.

వైభవంగా ముగిసిన వసంతోత్సవం



ఊరేగింపునకు వెళుతున్న స్వామి, అమ్మవార్లు

వెదురుకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వసంతోత్సవాలు ముగిశాయి. చివరి రోజైన సోమవారం సుప్రభాత సేవతో స్వామివార్లను మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామితో పాటు కోదండరామస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామివారికి వేదపండితులతో ఆస్థానం జరిగింది. ఏడు గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, సీతా సమేత కోదండరామస్వామిని తిరుచ్చి వాహనాలపై అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, అర్చకులు రమేష్, శబరి, గోపాలాచారి, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..!



వెంకటేషులు, గంగులమ్మ, సుబ్రమణ్యం

పలమనేరు, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. పలు సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో సింహభాగం రెవెన్యూకు సంబంధించినవే.. అందులో కొన్ని..

వ్యసాయ కనెక్షన్ ఇప్పించండి

● వ్యవసాయ కనెక్షన్ ఇవ్వాలని నెల్లిపట్ల ఎస్సీ, ఎస్సీ కాలనీలకు చెందిన వెంకటేసులు, గంగులమ్మ, సుబ్రమణ్యం కలెక్టర్‌ను కోరారు. కనెక్షన్ కోసం రూ. 18600,రూ.14,000, రూ14,000 చెల్లించి ఏడాది అవుతోదని ఇంతవరకు ఇవ్వలేదని వాపోయారు. న్యాయం చేయాలి అని విన్నవించారు.

సాగులోని భూమికి పట్టా ఇవ్వండి



మూడు ఎకరాల పొలం ఉండగా రీసర్వేలో 2.49 ఎకారాల భూమే ఉందని చూపారు. అలాగే 20 ఏళ్లుగా సాగులో ఉన్న 25 సెంట్లకు పట్టా ఇవ్వాలి.

- రైతు రమణప్ప, కుప్పనపల్లి గ్రామం, బైరెడ్డిపల్లి మండలం .

పాసు పుస్తకాలు మంజూరు చేయండి



నా సోదరుడికి నాకు సుమారు 4 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని రెవెన్యూ రికార్డుల్లో చేర్చాలి. సంవత్సరాలుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. అలాగే పాసు పుస్తకాలు ఇప్పించండి.

- చౌడిరెడ్డి, అప్పశెట్టిపల్లి, గంగవరం మండలం

గిరిజనుల సాగుభూమికి పట్టాలివ్వండి



సంవత్సరాలుగా 12 మంది గిరిజనులు 11 ఎకరాలను సాగు చేసుకుంటున్నారు. ఆ భూమికి పట్టాలు ఇవ్వాలని గతంలో వారు అనేకసార్లు కోరారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించండి

- బాబు, నెల్లిపట్ల పంచాయతీ రఘునాయకుల దిన్నె గ్రామం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కల్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని హెచ్‌ఎం శ్రీవాణి, ప్రహరీ క్లబ్ సమన్వయకర్త వెంకటసిద్ధులు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రహరీ క్లబ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా నేరమన్నారు. పొగాకు ఉత్పత్తులపై వ్యతిరేక ప్రచారం చేయాలన్నారు. ఉపాధ్యాయులు రాజేంద్ర, పద్మవేణి, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చిట్రెడ్డిపల్లెలో నడివీధి గంగమ్మ జాతర

చౌడేపల్లె, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): చిట్రెడ్డిపల్లెలో నడివీధి గంగమ్మ జాతర మంగళవారం ప్రారంభమవుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ మంగళవారం అమ్మవారికి కల్యాణం, బుధవారం జాతర జరగనున్నట్లు పేర్కొన్నారు.


ఇంటర్న్ షిప్ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



పాఠశాలలో సర్టిఫికెట్లతో విద్యార్థులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఇంటర్న్‌షిప్ చేసిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సర్టిఫికెట్లు హెచ్‌ఎం మోహన్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. 2024- 25 ఏడాదికి దసరా సెలవుల్లో పది మంది విద్యార్థులు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో రీటైల్ ట్రేడ్‌లో ఇంటర్న్ షిప్ పూర్తి చేశారు. విద్యార్థులకు వృత్తి విద్య కోర్సుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పాల్గొన్నారు.

పరుగు పందెంలో దివ్యాంగ విద్యార్థి ప్రతిభ



రాష్ట్ర స్థాయి విజేత నిలిచిన విక్రాంత్‌రెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీలో రొంపిచెర్ల మండలానికి చెందిన దివ్యాంగ విద్యార్థి విక్రాంత్‌రెడ్డి మొదటి స్థానం దక్కించుకున్నాడని భవిత పాఠశాల ఉపాధ్యాయురాలు అమ్ములు తెలిపారు. రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థి విక్రాంతరెడ్డి సోమవారం వెస్ట్ గోదావరిలో జరిగిన దివ్యాంగుల (సీడబ్ల్యూ ఎస్ఎన్) పరుగు పందెంలో పాల్గొన్నారు.

రేపు సదుం మండల మీట్

సదుం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సదుం మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు సదుం ఎంపీడీవో హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

21 రోడ్లకు రూ.21.60 కోట్ల మంజూరు

● ఎమ్మెల్యే భానుప్రకాష్


పంచాయతీరాజ్ డీఈఈతో చర్చిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నింద్ర, నగరి, విజయపురం మండలాల్లో పూర్తిగా దెబ్బతిన్న 21రోడ్లకు రూ.21.60 కోట్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. బీటీ రోడ్ల మంజూరుకు సంబందించి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీని నగరి పంచాయతీరాజ్ డీఈఈ సుబ్బరాయుడికి సోమవారం తన స్వగృహంలో అందజేశారు. ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోని, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు బాగుపడతాయని చెప్పారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు పూర్తి చేయాలని డీఈఈకి సూచించారు. సీఎం చంద్రబాబు సహకారంతో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిమెంటు రోడ్లు భారీగా వేయడం జరిగిందన్నారు.

టీడీపీ సీనియర్ నేతకు పరామర్శ

విజయపురం: మండలంలోని క్షూరికాపురంలో టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రాజును సోమవారం ఎమ్మెల్యే భానుప్రకాష్ పరామర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు రమేష్‌రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి: కమిషనర్


బాధితుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలను త్వరగా పరిష్కరించాలని సిబ్బందిని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కమిషనర్ అర్జీలను స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 9, టౌన్‌ప్లానింగ్‌కు, పింఛన్‌కు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 11 అర్జీలు అందాయి. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమికి మేలు



నవధాన్యాల సాగుపై ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నగరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాలను సాగు చేయడం ద్వారా భూమికి ఎంతో మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎం.కొత్తూరులో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో నవధాన్యాల సాగు.. రైతుకు మేలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు.రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



వెదురుకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పోతగంటి సిద్ధయ్యను ఉద్యోగ విరమణ సందర్భంగా పలువురు సోమవారం సన్మానించారు. పాఠశాలలో స్కూల్ కమిటీ ఛైర్మన్ చెంగల్రాయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, చెంగల్రాయరెడ్డి, సీనియర్ నేత సాతాల గుణశేఖర్‌యాదవ్, బూత్ కమిటీ కన్వీనర్లు చిరంజీవి నాయుడు, శంకరయ్య, విక్రమ్‌రెడ్డి, వైసీపీ నేత సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ రాధిక, పురంధర్‌రెడ్డి, దూదేకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పెరిగిన రచనా శక్తి


మంగళవిద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న కుప్పాల మురళి, ఉపాధ్యాయులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మంగళపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవిద్యావాణి 35వ సంచిక ఆవిష్కరణ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సర్పంచుల సంఘ కార్యదర్శి కుప్పాలపల్లె మురళి మాట్లాడుతూ.. ఈ మాసపత్రిక వల్ల విద్యార్థుల్లో రచనా శక్తి పెరిగిందని చెప్పారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణశివప్రసాద్, ఉపాధ్యాయులు సంజీవి, పిళ్ళారప్ప, సంపంగి, మోహన్‌రెడ్డి, భారతి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వానరాల మృతి

● ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ చర్యలు లేకపోవడమేనన్న స్థానికులు


వానర కళేబరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, తదితరులు

నగరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ కార్యాలయం సమీపాన ఉన్న ఓ సూపర్ మార్కెట్ వారు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా వానరాలు తరచూ విద్యుదాఘాతంతో మృతి చెందుతున్నాయని స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరైన భద్రత తీసుకోకపోవడం వల్లేనన్నారు. ఇదివరకే రెండు వానరాలు మృత్యువాత పడగా, సోమవారం మరో వానరం మరణించింది. అంజనేయస్వామి ఆలయం ముందే ఇలాంటి సంఘటనలు జరగడంపై భక్తులు ఆవేదన చెందుతున్నారు. కాగా, మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సూపర్‌మార్కెట్ యాజమాన్యాన్ని పిలిపించారు. వానర కళేబరాన్ని చూపించి.. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కూలడానికి సిద్ధంగా చింత చెట్టు



యాదమరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యాదమరి బస్టాండు వద్ద చింత చెట్టు ఒకటి కూలడానికి సిద్ధంగా ఉందని స్థానికులు ఆందోళన

పొంచి ఉన్న ప్రమాదం

వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో చెట్టు కూలితే పెద్ద ప్రమాదం జరుగుతుందని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

● గ్రామాల్లో టీచర్ల ప్రచారం

గుడిపాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే మెరుగైన విద్యను అందిస్తున్నారని నరహరిపేట జడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ డిల్లీబాయి, ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం రామభద్రాపురం పంచాయతీల్లో ఈ మేరకు ప్రచారాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్, శ్రీధర్‌తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని కేసీపల్లె పంచాయతీ గొల్లపల్లి దళితవాడలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయుడు మధు.. ప్రచార ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడిలో మెరుగైన విద్యాబోధన చేస్తారని చెప్పారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గంగాధరనెల్లూరు/వెదురుకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందడానికి అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గంగాధర నెల్లూరు, కార్వేటినగరం ఎంపీడీవోలు హరిప్రసాద్‌రెడ్డి, చంద్రమౌళి కోరారు. 21-50 ఏళ్లలోపున్నవారు, ఐదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు లేదా బ్యాంక్ లింక్డు రుణాలు పొందకుండా ఉండాలన్నారు. మే10వ తేదీలోపు https://apobmms.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు

గుడిపాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా పారిశుధ్యం లోపించినట్లు తనకు ఫిర్యాదు అందితే సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తప్పవని ఎంపీడీవో కుమార్ హెచ్చరించారు. సోమవారం గట్రాళ్లమిట్ట పంచాయతీలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'లో అధికారులకు బాధితుల మొర




బాధితుల అర్జీలను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ, వెంకటశివ, ఆర్డీవో శ్రీనివాసులు - నగరిలోని నత్తంకండ్రిగకు చెందిన బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు బాధితులు మొర పెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఈ మేరకు అర్జీలను సమర్పించారు. వినతులను డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ, వెంకటశివ, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు స్వీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రధాన అర్జీలిలా..

● శ్రీరామకృష్ణ భజన మందిరం స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జీడీ నెల్లూరు మండలం తూంగుండ్రం పంచాయతీలోని పిళ్లారికుప్పంవాసులు విజ్ఞప్తి చేశారు.

● సర్వే నెంబరు 435-2లో ఉన్న పట్టా భూమి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వెదురుకుప్పం మండలం యనమలమందవాసులు కోరారు. ఈ భూమిని స్వాధీనం చేసుకుని ఇళ్లులేని వారికి స్థలాలను కేటాయించాలని విన్నవించారు.

● నగరిలోని నత్తంకండ్రిగ దళితవాడలో 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న 80 కుటుంబాల వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు ప్రసంగించారు. మున్సిపాలిటీ ట్యాక్స్, విద్యుత్ కనెక్షన్లు, ఇతర సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని కోరారు.

● మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని జానకారపల్లెకు చెందిన శివకుమార్ విన్నవించారు. గతంలో మున్సిపాలిటీకి సంబంధించిన రోడ్డు ఇక్కడ ఉండేదని తెలిపారు. ఉన్నతాధికారులు సర్వేచేసి తిరిగి ఇక్కడ ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.



కలెక్టరేట్‌కొచ్చిన జీడీ నెల్లూరు మండలం పిళ్లారికుప్పం గ్రామస్తులు, వెదురుకుప్పం మండలం యనమలమందవాసులు

టీవీ, సెల్‌ఫోన్ చూస్తూ భోంచేయడం ఆపండి


గంగాధరనెల్లూరులో అధికారులతో కలిసి వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న వెంకటేశ్వరి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): టీవీలు, సెల్‌ఫోన్లలో ప్రోగ్రామ్‌లను చూస్తూ పిల్లలు భోంచేయడాన్ని తల్లిదండ్రులు ఆపాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీ వెంకటేశ్వరి పిలుపునిచ్చారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్‌లో సోమవారం గర్భిణులకు, బాలింతలకు అవగాహన సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. రోజూ ఆహారంలో మునగాకును తీసుకుంటే వివిధ రోగాలు దరి చేరకుండా నిర్మూలించవచ్చని సూచించారు. సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఎంఈవో గుణశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, గంగాధరనెల్లూరు, పాలసముద్రం పీహెచ్‌సీల సీహెచ్‌వోలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఆవుదేవర నందీశ్వరస్వామి, సిద్దేశ్వరస్వామి

వెదురుకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శివ, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీ సేవలో ఊరేగించారు. ● ఎగువ కన్నికాపురం వద్ద వెలసి ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్దేశ్వరస్వామికీ పాలాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు. ● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. ఏర్పాట్లను ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

'వక్ఫ్' అనేది దాతృత్వ నిధి : బీజేపీ


వక్ఫ్ సవరణ చట్టం కరపత్రాన్ని విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 'వక్ఫ్' అనేది ఇస్లామిక్ చట్టం ప్రకారం దాతృత్వ నిధి అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ అన్నారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆయన బీజేపీ కార్యాలయంలో వక్ఫ్ సవరణ చట్టం కరపత్రం విడుదల చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు, మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిమస్తాన్, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షంషీర్, నాయకులు షేక్ బావాజి, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

సోమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సోమల - సదుం మార్గంలోని అభయాంజనేయ ఆలయం సమీప టమోటా తోట వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. సోమల సింగిల్ విండో మాజీ ఛైర్మన్ ఎం.శ్రీనివాసులు కుమారుడు ఎం.మునీంద్ర (50) సోమవారం పొలం వద్ద ఎవరూ లేని సమయంలో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. మునీంద్ర పొలాన్ని కౌలుకు తీసుకున్న కలకడకు చెందిన వారు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మృతుడి భార్య కొంతకాలం క్రితం ఇతడితో విభేదించి వెళ్లిపోయింది. తల్లి పెరాలసిస్‌తో బాధపడుతోంది. ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆర్థికసమస్యలు వెంటాడడంతో ఆత్మహత్య చేసుకుని ఉండచ్చని స్థానికులు భావిస్తున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకూడదు

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్


కార్వేటినగరంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఈ విజయకుమార్

వెదురుకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్ ఆదేశించారు. సోమవారం కార్వేటినగరంలో వెదురుకుప్పం, ఎస్ఆర్ పురం, కార్వేటినగరం ఏఈఈలు, డీఈఈతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తాగునీటి బోర్లలో అదనపు పైపులు అమర్చాలన్నారు. బోర్ వెల్‌ను ఫ్లష్, డీపెనింగ్ చేయడం, వ్యవసాయ బోర్లను అనుసంధానం చేయడం, అవసరమైన చోట్ల ట్యాంకర్లతో నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మండలాల్లో ఏఈఈలు, పంచాయతీ కార్యదర్శులతో తనిఖీలు చేసి ఈ నెలాఖరులోపు నీటి సరఫరాలో లోటుపాట్లను గుర్తించి నోటీసులు అందజేయాలన్నారు. నోటీసు నకలును ఈనెల 28వ తేదీన ఎస్ఈ కార్యాలయంలో చేర్చాలని చెప్పారు. అలాగే అన్ని పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఈనెలాఖరులోపు నీటి నమూనాలను సేకరించి కార్వేటినగరం ల్యాబ్‌లో కెమికల్, బ్యాక్టీరియోలాజికల్ పరీక్షలు జరిపి ఫలితాలను రికార్డు చేయాలని ఆదేశించారు.

పీహెచ్‌సీ ఆవరణంలో చెత్తాచెదారం



గుడిపాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో చెత్తా చెదారం నిండిపోయింది. ఈ ఆస్పత్రికి రోజూ 50 మంది నుంచి 70 మంది వరకు రోగులు వస్తుంటారు. అటువంటిది ఇక్కడికొస్తే జబ్బు మరింత ఎక్కువయ్యేలా పరిసరాలు ఉన్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డాక్టర్లు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

రామకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గెర్నిపల్లెలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు.. గెర్నిపల్లెకు చెందిన పవన్‌రెడ్డి తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం నిల్వ ఉంచుకున్నట్టు సోమవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేసి అతని ఇంటి వద్ద 10 బీరుబాటిళ్లు, 23 మద్యం టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడు పవన్‌రెడ్డిని అరెస్టు చేశారు. రిమాండుకు తరలించారు.

వైభవంగా ముగిసిన వసంతోత్సవం


ఊరేగింపునకు వెళుతున్న స్వామి, అమ్మవార్లు

వెదురుకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వసంతోత్సవాలు ముగిశాయి. చివరి రోజైన సోమవారం సుప్రభాత సేవతో స్వామివార్లను మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామితో పాటు కోదండరామస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామివారికి వేదపండితులతో ఆస్థానం జరిగింది. ఏడు గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, సీతా సమేత కోదండరామస్వామిని తిరుచ్చి వాహనాలపై అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, అర్చకులు రమేష్, శబరి, గోపాలాచారి, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

తల్లిపాలు అమృతంతో సమానం

విజయపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని నగరి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. సోమవారం విజయపురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో రాజేంద్ర, వైద్యాధికారి విష్ణుప్రియ, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ ఏళుమలై, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

వెదురుకుప్పం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఫిజియో థెరపీపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో ఎల్.పురుషోత్తం సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు ఫిజియోథెరపీపై అవగాహన సమావేశం జరిగింది. హైదరాబాదుకు చెందిన నిజాం ఫిజియోథెరపీ వైద్యులు రమేష్‌సంతోష్‌లు పలుఅంశాలను తెలిపారు.

వైసీపీని బలోపేతం చేస్తా

● బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



చిత్తూరు సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలందరినీ కలుపుకుని వైసీపీని బలోపేతం చేస్తానని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ చెప్పారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తనికీ పదవి రావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కాలబైరవేశ్వరుడికి విభూది అలంకరణ



నగరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న కాళభైరవేశ్వరుడి గుడిలో అష్టమి పూజల సందర్భంగా స్వామికి విభూది అలంకరణ చేశారు. ఏర్పాట్లను నిర్వాహకుడు సుబ్రహ్మణ్యం పర్యవేక్షించాడు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



పుంగనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పుంగనూరు వారపు సంతలో సోమవారం తప్పిపోయిన ఆరేళ్ల బాలికను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక కొత్తపేటకు చెందిన కిశోర్ భార్య శోభారాణి తన ఆరేళ్ల కుమార్తెను తీసుకుని సంతకు వెళ్లింది. శోభారాణి కూరగాయలు, నిత్యావసర వస్తువులు తీసుకుంటుండగా బాలిక కనిపించలేదు. తల్లి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియరాలేదు. పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో బిడ్డ తప్పిపోయినట్లు ఫిర్యాదు చేసి పాప ఫొటో ఇచ్చారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ లోకేశ్ వారి సిబ్బందితో గాలించారు. ఎంబీటీ రోడ్డులో కనిపించడంతో స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సీఐ, ఎస్ఐలు గంటల వ్యవధిలోనే బిడ్డను తల్లిదండ్రులకుఅప్పగించడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.